RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:62 THURSDAY,JULY 30,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :62 గురువారం, జూలై 30, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

## తెలంగాణలో 7,437 కానిస్టేబుల్, SI ఉద్యోగాలకు భారీ నోటిఫికేషన్ విడుదల..

రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త..






**తెలంగాణ పత్రిక:** తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి బుధవారం (జులై 29) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా మొత్తం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు. వీటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,437 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సివిల్ పోలీసు, ఆర్మ్‌డ్ రిజర్వ్ , స్పెషల్ పోలీసు, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఈ నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. ఏయే పోస్టులున్నాయంటే.. సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు (సివిల్) 148 రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 14 మిగతా2లో



# కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక..

## ఎల్ఐసీ నుంచి రూ.12,207 కోట్ల డివిడెండ్

యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2,853 కోట్లు
న్యూ ఇండియా అష్యూరెన్స్ నుంచి రూ.211 కోట్లు
పీఎస్‌బీల జీఎన్‌పీఏ 1.9 శాతానికి తగ్గుదల
ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లు

**తెలంగాణ పత్రిక:** కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ. 12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు నెలకొల్పాయి.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మిగతా2లో

# 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి




**తెలంగాణ పత్రిక:** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు మిగతా2లో

## బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?



**తెలంగాణ పత్రిక:** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం మిగతా2లో



## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

**తెలంగాణ పత్రిక:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ మిగతా2లో



# మంత్రి ఉత్తమ్

## హైడ్రాపై కీలక వ్యాఖ్యలు

ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశం
మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..
నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది..

**తెలంగాణ పత్రిక:** హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని మిగతా2లో

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

## లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం



- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

2

# తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట




**తెలంగాణ పత్రిక:** తెలంగాణలోని పాల మూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన మిగతా2లో

## ప్లాస్టిక్ నిషేధం చట్టాలున్నా మారని తీరు..

### యంత్రాంగం ఉక్కుపాదం మోపాల్సిన సమయమిదే.!




**తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఎన్నో నిబంధనలు తెస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. ఒకానొక సమయంలో అధికారులు జరిమానాలు విధిస్తారన్న భయంతో, దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను నిలిపివేశారు; ప్రజలు కూడా స్వచ్ఛందంగా గుడ్డ సంచులను వాడారు. కానీ, కొద్ది రోజులు గడిచాక యథావిధిగా మళ్లీ ప్లాస్టిక్ వాడకం జోరందుకుంది. ప్లాస్టిక్ రహిత సమాజం కేవలం కాగితాలకే పరిమితమవుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. మిగతా2లో



# రష్యాపై అమెరికా ఎకనామిక్ స్ట్రైక్..

## భారత్ సహా పలు దేశాలపై ప్రభావం చూపే బిల్లు..!

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** రష్యాపై మరింత ఆర్థిక ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన కీలక ఆంక్షల బిల్లుపై అమెరికా సెనేట్ విధానపరమైన ఓటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా పేరొందిన దివంగత మిగతా2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజాన్



# కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది. ప్రతి ప్రభుత్వ రంగ బ్యాంకు 90 శాతానికి పైగా ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియోను కొనసాగించింది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థమైన రిస్క్ మేనేజ్‌మెంట్ బ్యాంకుల ఆర్థిక బలాన్ని మరింత పెంచాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క

చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్ 'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ(దీూూ)లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# హైడ్రాపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశం కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం.. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది.. కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# రష్యాపై అమెరికా ఎకనామిక్ స్ట్రైక్..

రష్యాపై మరింత ఆర్థిక ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన కీలక ఆంక్షల బిల్లుపై అమెరికా సెనేట్ విధానపరమైన ఓటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా పేరొందిన దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహంకు నివాళిగా ఈ బిల్లును ముందుకు తీసుకువస్తున్నట్లు జెలెన్స్కీ పేర్కొన్నారు.రష్యాపై మరింత ఆర్థిక ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన కీలక ఆంక్షల బిల్లుపై అమెరికా సెనేట్ విధానపరమైన ఓటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా పేరొందిన దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహంకు నివాళిగా ఈ బిల్లును ముందుకు తీసుకువస్తున్నట్లు జెలెన్స్కీ పేర్కొన్నారులిండ్సే ఓ. గ్రాహం రష్యా, ఇరాన్‌పై ఆంక్షల చట్టం--2026'గా పిలుస్తున్న ఈ బిల్లు, రష్యా చమురు, సహజవాయువు ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని తగ్గించడమే లక్ష్యంగా రూపొందించారు. రష్యా ఇంధనాన్ని పెద్ద ఎత్తున దిగుమతి చేసుకునే దేశాలపై కఠిన చర్యలు తీసుకునే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి ఈ చట్టం కల్పిస్తుంది. రష్యా ముడి చమురు లేదా గ్యాస్‌ను అత్యధికంగా కొనుగోలు చేసే ఐదు దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఈ బిల్లులో ఉంది. ఈ బిల్లు చట్టంగా మారితే భారత్, చైనా, జపాన్‌తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని కొన్ని దేశాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా రష్యా చమురును అధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాలపై అదనపు సుంకాల భారం పడే అవకాశముంది. అయితే ఆ సుంకాలను అమలు చేయాలా లేదా అనే విషయంలో తుది నిర్ణయాధికారం అమెరికా అధ్యక్షుడికే ఉంటుంది.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లులో ఇరాన్‌పై అదనపు ఆంక్షలకు సంబంధించిన నిబంధనలను చేర్చిన తర్వాత దీనికి మద్దతు ప్రకటించారు. మరోవైపు, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు మాత్రం ఈ బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్షుడికి విస్తృత సుంకాల అధికారాన్ని ఇవ్వడం వల్ల అమెరికా మిత్రదేశాలతో వాణిజ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. అయితే రిపబ్లికన్, డెమోక్రటిక్ సభ్యుల ద్వైపాక్షిక బృందం ఈ బిల్లుకు మద్దతు ప్రకటించింది. రష్యా చమురు, గ్యాస్ ఆదాయం ద్వారా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధాన్ని కొనసాగించే అవకాశాలను అడ్డుకోవడంతో పాటు, ఇరాన్‌కు ఇంధనం, ఆయుధాల కోసం నిధులు సమకూరకుండా నిరోధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా సెనేట్‌లో జరిగే ఓటింగ్ అంతర్జాతీయ రాజకీయాలు, ఇంధన మార్కెట్లు, భారత్ వంటి దేశాల వాణిజ్య ప్రయోజనాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'.. కేటీఆర్‌పై తుమ్మల సెటైర్

లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఖూజ్రా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# ప్లాస్టిక్ నిషేధం చట్టాలున్నా మారని తీరు..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఎన్నో నిబంధనలు తెస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. ఒకానొక సమయంలో అధికారులు జరిమానాలు విధిస్తారన్న భయంతో, దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను నిలిపివేశారు; ప్రజలు కూడా స్వచ్ఛందంగా గుడ్డ సంచులను వాడారు. కానీ, కొద్ది రోజులు గడిచాక యథావిధిగా మళ్లీ ప్లాస్టిక్ వాడకం జోరందుకుంది. ప్లాస్టిక్ రహిత సమాజం కేవలం కాగితాలకే పరిమితమవుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ, సులువుగా దొరుకుతున్నాయనే ఉద్దేశంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ప్రజలు మళ్లీ వాడటం గమనార్హం. నేడు మనం వేస్తున్న ఈ ప్లాస్టిక్ అడుగులు రేపటి తరాలకు విషాన్ని పంచుతున్నాయి అనే కనీస స్పృహ కొరవడటం పట్ల పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. మార్కెట్లలో విక్రయించే చిల్లర దుకాణదారులపై ఒత్తిడి తెచ్చే బదులు, ప్లాస్టిక్ కవర్లను తయారు చేసే హోల్‌సేల్ దుకాణాలు మరియు తయారీ పరిశ్రమలపై ఉక్కుపాదం మోపాలి. అధికారులు ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి వదిలేయకుండా, నిరంతరం పర్యవేక్షణ ఉండేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. అలాగే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందుతున్న చిన్నతరహా పర్యావరణ అనుకూల పరిశ్రమలకు ప్రభుత్వాలు రాయితీలు, సబ్సిడీలు అందించి ప్రోత్సహించాలి. ప్రభుత్వం చెబుతోంది, ఎవరికివారే బాధ్యత తీసుకోవాలి అనుకుంటే సరిపోదు. చట్టాల వల్ల వచ్చే భయం తాత్కాలికమే కానీ స్వచ్ఛందంగా వచ్చే మార్పు శాశ్వతం. మన ఇళ్ల నుంచి, మన చేతుల మీదుగా ప్లాస్టిక్‌ను తరిమేస్తేనే నేలతల్లి ఊపిరి పీల్చుకోగలదు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూనే, ప్రజలు కూడా తమ ఆరోగ్యం కోసం బాధ్యతాయుతంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

ఏయే పోస్టులున్నాయంటే.. సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు (సివిల్) 148 రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 14 రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 12 రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 3 అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు 23 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (రాూ=బూూ) పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (డ్రైవర్) పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (మెకానిక్) ఎస్పై పోస్టులు 44 కానిస్టేబుల్ పోస్టులు 1380 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు 39 ఫైర్ ఫైటర్ పోస్టులు 751 డిప్యూటీ జైలర్ (పురుషులు) పోస్టులు 14 డిప్యూటీ జైలర్ (మహిళలు) పోస్టులు 1 వార్డెన్ (పురుషులు) పోస్టులు 196 వార్డెన్ (మహిళలు) పోస్టులు 12 ఈ నోటిఫికేషన్‌తో పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థులకు మంచి అవకాశం లభించింది. త్వరలో అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల షెడ్యూల్ తదితర పూర్తి వివరాలను పోలీసు నియామక మండలి వెల్లడించనుంది. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా పరిశీలించి, అర్హతలు నిర్ధారించుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణలో భక్తులకు, కోతులకు అన్నప్రసాదం

**-గురుపౌర్ణమి సందర్భంగా దత్త ఆలయంలో సేవా కార్యక్రమాలు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 29, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో గురువారం రోజున కొండగట్టు ఆంజనేయస్వామి గిరిప్రదక్షిణ సందర్భంగా భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కోతులకు అన్నప్రసాదం అందజేశారు. అలాగే గురుపౌర్ణమి సందర్భంగా దత్త ఆలయంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న నిర్వాహకులు మాట్లాడుతూ, భక్తులకు సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల కురిసిన



భారీ వర్షాల కారణంగా గిరిప్రదక్షిణ మార్గంలో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడడం, రహదారిపై గండ్లు ఏర్పడడం, పైపులు బయటపడడం వంటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. దీంతో గిరిప్రదక్షిణకు వచ్చే వేలాది మంది భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చి, రహదారిని సరిచేసి, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి కేంద్రాలు, విద్యుత్ వెలుగులు, మరుగుదొడ్లు వంటి మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. ఈ సేవా కార్యక్రమంలో ఆవుల లక్ష్మారెడ్డి, గూడ రాజు, మంజేడి శ్రీనివాస్, ఎర్ర అనిల్ రెడ్డి తదితరులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

**-రానున్న 36 గంటల్లో భారీ వర్షాల అవకాశం**

**-అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 29

రానున్న 36 గంటల్లో వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే



ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, వాగులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ప్రవాహాన్ని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అన్నారు . గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం హామీలను త్వరగా అమలు చేయాలి







**-కేజీఎస్ మాథ్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం, తెలంగాణ పత్రిక జూలై 29:

ఉద్యమకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మలిదశ, తొలిదశ ఉద్యమకారుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కేజీఎస్ మాథ్యూస్ ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమం నుంచి వివిధ దశల్లో పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమంపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఛైర్మన్ కె కేశవరావు, రాముునాయక్, శోభన్ రెడ్డి, అద్దంకి దయాకర్త రావు, కోదండ రామ్, మోతే శోభన్రి రెడ్డి తదితరులు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల ఉద్యమకారుల అభిప్రాయాలు, సూచనలు సేకరించారని చెప్పారు. వాటి ఆధారంగా ప్రభుత్వం సమగ్ర నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు, అమరుల కుటుంబాలకు తగిన పరిహారం, అలాగే బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం, మెరుగైనా వైద్యం, గుర్తింపు కార్డు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని మాథ్యూస్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉద్యమకారుల్లో చాలా మంది ఇప్పటికే 70 నుంచి 80 ఏళ్ల వయస్సు దాటారని, అందువల్ల ఆలస్యం చేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న కమిటీ సభ్యులు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు, రాముునాయక్, శోభన్ రెడ్డి, దయాకర్ తదితరులకు కేజీఎస్ మాథ్యూస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసంతో ఉన్నామని, తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి. రామచందర్, కామేశ్వరరావు, కొమరయ్య, వీరస్వామి, సీతారాం, మంగపతి, గౌస్, పురుషోత్తం, కృష్ణార్జునరావు, మండే అంజనేయులు, శ్రీహరి, కామేశ్వారారావు, నాగేశ్వరావు, దామేరాకొండ మల్లయ్య, భీమయ్యా, సర్వత్తం రావు, విజయకుమార్, నిజామోద్దీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# డెంగీ, మలేరియాపై ముందస్తు ముప్పేట చర్యలు ప్రతి మంగళ, శుక్రవారాలు 'డ్రై డే' నిర్వహించాలి

**- డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో, సిద్ధిపేట జిల్లా**

నంగునూరు, జూలై 29(తెలంగాణ పత్రిక):

వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధుల నివారణకు ఆరోగ్యశాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.హెచ్. ధనరాజ్ సూచించారు. బుధవారం రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వైద్య సేవల అమలు తీరును సమీక్షించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో టీకాల కార్యక్రమం, జాతీయ ఆరోగ్య పథకాల అమలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించి నీటి నిల్వలను తొలగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని, అత్యవసర సేవల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని పేర్కొన్నారు. భారీ వర్షాల వల్ల రాకపోకలు నిలిచిపోయే గ్రామాలను ముందుగానే గుర్తించి గర్భిణులకు వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీతాలే కృష్ణాజి జ్ఞాపకార్థం బియ్యం బ్యాగులు పంపిణీ

**-లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రమేష్**



పోతంగల్ తెలంగాణ పత్రిక జులై 29.

పోతంగల్ మండల కేంద్రంలోని హరిజనవాడ కాలనీలోని నాలుగు పేద కుటుంబాలకు 25 కిలోల చొప్పున లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతాలే రమేష్ చేతుల మీదుగా వారి నాన్న సితాలే కృష్ణాజి జ్ఞాపకార్థం కోసం ఒక క్వింటల్ బియ్యం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సితాలే రమేష్ సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుంటూ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి మండలాల్లోని అంత్యక్రియల కోసం ఆస్పత్రి వైద్య ఖర్చుల కొరకు ఎన్నో సాయ సహకారాలు అందించిన వ్యక్తి రమేష్ అని కొనియాడారు. నేడు వారి నాన్న జ్ఞాపకార్థం కోసం ఎస్సీ కాలనీలోని బియ్యం బ్యాగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆయనకు కాలనీ తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీతాలే రమేష్ ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉంటూ మునుముందు ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ ఉమ్మడి మండలాల ప్రజల మన్ననలు పొందాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ సభ్యులు పంచారెడ్డి అనిల్ సుదం శ్రవణ్ సితాలే సంతోష్ గ్రామ యువకులు సతీష్ గంగాధర్ సుభాష్ నాగేష్ రమేష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేవైసీ కష్టాలు... ఆధార్ కేంద్రం వద్ద బారులు

**-ఈనెల 31 చివరి తేదీ**



ముధోల్:29జూలై(తెలంగాణ పత్రిక)



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి కేవైసీ తప్పనిసరిగా చేయడంతో గ్రామాల్లో పలు లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఆధార్ అప్డేట్ లేకపోవడంతో రేషన్ దుకాణాల్లో ఈపాస్ లో వారి వేలిముద్రలు నమోదు కావడం లేదు. దీంతో ఆధార్ అప్డేట్ కోసం తల్లిదండ్రులు,పిల్లలతో మండల కేంద్రమైన ముధోల్ లోనితహసిల్దార్ కార్యాలయ ఆధార్ కేంద్రం వద్ద వేకువ జామున క్యూలైన్ లో వేచి ఉన్నారు. మరోపక్క ఈనెల 31వ తేదీ లోపు కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం గడువు విధించింది. దీంతో తల్లిదండ్రులు,పిల్లలతో ఆధార్ అప్డేట్ కోసం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరారు.

# శ్రీ అక్షర పాఠశాలలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు




ముధోల్:29జూలై(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని శ్రీ అక్షర పాఠశాలలో గురుపౌర్ణమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా వ్యాస మహర్షి చిత్రపటానికి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జారి కోట్ సుభాష్ మాట్లాడుతూ గురువు లేని జీవితం చీకటి లాంటిదన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు పునాదులు వేసేది తరగతి గది నుండేనని అన్నారు. తల్లిదండ్రులు తొలి గురువులైతే, పాఠశాలలో విద్యతో పాటు నైతిక విలువలు, జీవిత సత్యాలను బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తారన్నారు. అనంతరం పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులందరికీ ఘనంగా సన్మానించే జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 36 గంటలు అతి భారీ వర్షాలు పడే అవకాశం

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్
-అత్యవసర పరిస్థితులకై 24 గంటల కంట్రోల్ రూమ్ 7989193131 కు సమాచారం అందించాలి




జగిత్యాల పట్టణం, జూలై 29 (తెలంగాణ పత్రిక): వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు వచ్చే 36 గంటల్లో బారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరం తప్ప బయటకు వెళ్లకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 7989193131 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కోమటిపల్లి అడవిలో బీఆర్ఎస్ బృందం పర్యటన

మంగపేట,జూలై 29 (తెలంగాణ పత్రిక)



ములుగు జిల్లా మంగపేట మండలం పరిధిలోని కోమటిపల్లి అటవీ ప్రాంతంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యం కారణంగా నేలకూలిన భారీ వృక్షాలను బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న అటవీ ప్రాంతాన్ని సందర్శించి, చెట్లు నేలకూలిన పరిస్థితులను పరిశీలించారు. గతంలో మేడారం అటవీ ప్రాంతంలో జరిగిన ఘటన మాదిరిగానే, బలమైన ఈదురుగాలులు లేదా సుడిగాలి ప్రభావంతోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల అటవీ సంపద దెబ్బతినడం ఆందోళనకరమని, దీనివల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు వన్యప్రాణుల మనుగడపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి నేలకూలిన చెట్లను తొలగించడంతో పాటు, దెబ్బతిన్న ప్రాంతంలో విస్తృత స్థాయిలో అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, బాడిషా నాగ రమేష్, కూనూరు అశోక్ గౌడ్, చిట్టి మల్ల సమ్మయ్య, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, ఎస్.కె. కుర్బాన్ అలీ, యలవర్తి శ్రీనివాసరావు, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఎండి. అయూబ్, జాడి భోజారావు, సంకోజు ప్రశాంత్, మూగల రమేష్, రావుల రమణ సంతోష్, గండపల్లి నర్సయ్య, మునగాల నరేష్, మునిగల సాంబులు, పుల్ల సోయం ఈశ్వరయ్య, వంశీ, మునగాల మహేష్, జాడి కృష్ణతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న దర్శనం గిరి ప్రదర్శన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్

జగిత్యాల, జూలై 29 (తెలంగాణ పత్రిక):





జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రతేక పూజలు చెసి తీర్థం ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడి పంటలు సంపూర్ణంగా పండాలని కోరారు. అనంతరం గిరి ప్రదక్షిణ చెసి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో వరుణ పూజ నిర్వహించారు. మంత్రుల వెంట ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్ స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ ఆర్డీఓ మధుసూదన్ ఈఓ అంజన్నరెడ్డి డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య బండ శంకర్ కార్యకర్తలు నాయకులు అధికారులు తదితరులు వారి వెంట ఉన్నారు.

## యూట్యూబ్ ప్రకటనతో రూ.72.69 లక్షల సైబర్ మోసం.. అప్రమత్తంగా ఉండాలని తూప్రాన్ సీఐ వెంకటపతి రాజాగౌడ్ హెచ్చరిక

-అపరిచిత లింకులు, యాప్‌లకు దూరంగా ఉండాలని తూప్రాన్ సీఐ వెంకటపతి రాజాగౌడ్ సూచన



వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 29 (తెలంగాణ పత్రిక): తూప్రాన్: యూట్యూబ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికలను ఆసరాగా చేసుకుని స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తూప్రాన్ సీఐ వెంకటపతి రాజాగౌడ్ హెచ్చరించారు. నిన్న తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో జరిగిన భారీ సైబర్ మోసంపై కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తూప్రాన్ కు చెందిన ఓ వ్యక్తి ఇంతకుముందు హైదరాబాద్లో నివసిస్తూ హైదరాబాద్ నుంచి తూప్రాన్‌కు వచ్చిన ఓ వ్యక్తి యూట్యూబ్ చూస్తుండగా స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన ఆకర్షణీయమైన ప్రకటన కనిపించింది. అందులో సూచించిన వాట్సాప్ గ్రూపులో చేరిన బాధితుడు, నిర్వాహకులు ఇచ్చిన సూచనల మేరకు విడతల వారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. ప్రారంభంలో పెట్టిన కొంత మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించి నమ్మకం పెంచిన సైబర్ నేరగాళ్లు, ఆ తర్వాత మరింత పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించారు. లాభాలు వస్తున్నాయనే నమ్మకంతో బాధితుడు భారీ మొత్తాలను పెట్టుబడిగా చెల్లించాడు. తర్వాత తన ఖాతాలో చూపిస్తున్న డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అది సాధ్యపడలేదు. నిర్వాహకులను సంప్రదించగా ట్రాన్సాక్షన్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు, ట్యాక్స్, ప్రాసెసింగ్ ఫీజు వంటి వివిధ పేర్లతో మరిన్ని డబ్బులు చెల్లించాలని కోరారు. వారు చెప్పిన మాటలు నమ్మిన బాధితుడు మొత్తం రూ. 72,69,973 చెల్లించాడు. అయినప్పటికీ డబ్బు విడుదల కాకపోగా మరోసారి కూడా నగదు డిమాండ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత బ్యాంకు ఖాతాలను ట్రాక్ చేసి రూ. 9 లక్షలకు పైగా మొత్తాన్ని హోల్డ్ చేయగలిగారు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా తూప్రాన్ సీఐ వెంకటపతి రాజాగౌడ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో కనిపించే పెట్టుబడుల ప్రకటనలు, లాటరీలు, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయంటూ చేసే ప్రచారాలను గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఏ సంస్థలోనైనా పెట్టుబడి పెట్టే ముందు దాని చట్టబద్ధత, విశ్వసనీయతను తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. "కష్టపడకుండా తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయనే ఆశే సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారుతోంది. అలాంటి ప్రకటనల వెనుక మోసం దాగి ఉండే అవకాశం ఎక్కువ. అందుకే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి" అని సీఐ పేర్కొన్నారు. అలాగే ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా సంబంధిత బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి, నష్టపోయిన మొత్తాన్ని తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని సీఐ వెంకటపతి రాజాగౌడ్ స్పష్టం చేశారు.

## దూరవిద్యకు కొత్త ఊపిరి... ముధోల్ డిగ్రీ కళాశాల










-అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం
-ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చొరవతో మంజూరు
-ఉద్యోగాలు, ఉన్నత విద్యకు విద్యార్థులకు సువర్ణావకాశం

ముధోల్: 29జూలై(తెలంగాణ పత్రిక) గ్రామీణ నిరుపేదలకు ఉన్నత విద్యను అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ) అధ్యయన కేంద్రం మంజూరైంది. ఈ నిర్ణయంతో ముధోల్,బాసర,తానూర్,లోకేశ్వరంతోపాటు పరిసర ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, వివిధ కారణాలతో చదువును మధ్యలో నిలిపివేసిన వారు ఇకపై స్థానికంగానే దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం పొందనున్నారు.

-ఎమ్మెల్యే చొరవతో మంజూరు

ఈ అధ్యయన కేంద్రం ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ చూపిన స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ముధోల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులకు కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కృషి వల్లే ఈ అవకాశాన్ని ముధోల్ నియోజకవర్గ ప్రజలు పొందగలిగారని వారు పేర్కొన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పూర్తి చేయడంతో పీజీతో పాటు డిప్లొమా కోర్సులు పూర్తి చేసి విద్యార్థులు తమ ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో పాటు చదువును కొనసాగించే వీలుంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ అధ్యయన కేంద్రం ప్రారంభంతో ముధోల్ విద్యా రంగంలో మరో ముందడుగు పడిందని, ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చుకునేందుకు యువతకు ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. నిరుపేదలకు మంచి అవకాశం: దేవోజీ భూమేష్(మాజీ ఎంపీటీసీ) ముధోల్ లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కళాశాలతో నిరుపేద విద్యార్థులకు డిగ్రీ విద్యను అభ్యసించవచ్చు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీ మంచి అవకాశం. గత ప్రభుత్వాలు ముధోల్ లో డిగ్రీ కళాశాల, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తీసుకురాలేదు. ఎమ్మెల్యే రామారావు పటేల్ కృషితో డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయి. దీంతో ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు. దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య ముధోల్ డిగ్రీ కళాశాలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మంజూరు కావడం సంతోషకరమైన విషయం. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు దూరవిద్యను దరఖాస్తు లు చేసుకొవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## 26 ఏళ్ల నిజాయితీ సేవకు ఉద్యోగ విరమణ

-లక్ష్మీనర్సుకు ఘన సన్మానం..
ఆత్మీయుల అభినందనలు



కొత్తగూడెం, జూలై 29 (తెలంగాణ పత్రిక): పాఠశాలలో అటెండర్‌గా 26 సంవత్సరాల పాటు నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించిన కాశీమాల లక్ష్మీనర్సు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, బంధువులు, ఆత్మీయుల సన్మానాలతో సందడిగా మారింది. 26 ఏళ్ల సుదీర్ఘ సేవా కాలంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి లక్ష్మీనర్సు అందరి అభిమానాన్ని చూరగొన్నారు. సేవలో నిజాయితీ, విధి నిర్వహణలో నిబద్ధతకు ఆయన నిదర్శనంగా నిలిచారని పలువురు కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించిన లక్ష్మీనర్సు, కుమార్తెకు మంచి వివాహం జరిపించి, కుమారుడిని ఇంజనీరింగ్ చదివించి ప్రయోజకుడిగా తీర్చిదిద్దారు. కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆయన జీవితం ఆదర్శప్రాయమని పలువురు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణతో విధులకు మాత్రమే వీడ్కోలు పలికారని, లక్ష్మీనర్సుతో తమకున్న అనుబంధం, ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధువులు, ఆత్మీయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, తెలంగాణ క్రైమ్ రిపోర్టర్, బీసీ సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శంకర్ లక్ష్మీనర్సును ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, కుటుంబ సభ్యుల ప్రేమానురాగాల మధ్య ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దాసరి సాంబశివరావు, నర్సింగోజ్, విష్ణువర్ధన్, ప్రభాకర్ పాల్గొని లక్ష్మీనర్సుకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## సేంద్రియ విధానం మేలు



తానూర్:జూలై29(తెలంగాణ పత్రిక) సేంద్రియ పద్ధతిలో సాగు ఆరోగ్యమైందని ఏఈవో గణేష్ అన్నారు. మండలంలోని కోలూర్ గ్రామ రైతు వేదికలో సేంద్రీయ వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు తగ్గించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడినవారమవుతామని, ప్రజలకు ఆరోగ్యమైన ఆహారం అందించిన వారమవుతామని తెలిపారు. సర్పంచ్ మాధవ్ రావ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ధర్మేందర్,ఆయిల్ పామ్ క్లస్టర్ యోగేశ్వర్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి:

# జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 29, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న బోనాల సబ్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సార్వత్రిక టీకాల కార్యక్రమం (యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ - యూఐపీ)ను జిల్లా వైద్య ఒ ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా టీకా సెషన్ నిర్వహణ తీరును, వ్యాక్సిన్‌ల నిల్వ విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, లబ్ధిదారుల నమోదు, టీకాల వినియోగం, మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డుల నిర్వహణతో పాటు ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. టీకా కార్యక్రమం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతున్న తీరును సమీక్షించి సంబంధిత ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి గర్భిణి, ప్రతి శిశు



వు, చిన్నారికి జాతీయ టీకా షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. టీకాలు పిల్లలను ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వంద శాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో టీకాలపై అవగాహన మరింత పెంపొందించాలని, టీకాలకు గైర్హాజరైన గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి వెంటనే టీకాలు అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి టీకా సెషన్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, ప్రతి అర్హ లబ్ధిదారునికి సకాలంలో టీకాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డా. సంపత్‌కుమార్, వీసీసీఎం నవీన, ఏఎన్ఎంలు మరియు సంబంధిత ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుపౌర్ణమిన శ్రీ సాయిబాబ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మిర్యాలగూడ ప్రతినిధి//జూలై 29:(తెలంగాణ పత్రిక):-

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట శ్రీ సాయిబాబ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిర్యాలగూడ నియోజకవర్గం ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తదనంతరం దేవాలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు..ఈ సందర్భంగా గురుపౌర్ణమి ఆధ్యాత్మికత, గురువుల గొప్పతనాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


# చినుకే చిత్తడి.. గుంతలమయమైన నిజాంపేట రహదారులు

-రోడ్ల మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం..

-వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ నేత బిక్షపతి యాదవ్ డిమాండ్

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:

చిన్నపాటి వర్షానికే నిజాంపేట సర్కిల్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లు పూర్తిగా చిత్తడిగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్ల దుస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి రహదారులపై నీరు నిలిచి భారీ గుంతలు కనిపించకుండా పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ స్తంభించి గమ్యస్థానాలకు చేరుకోవడానికి గంటల సమయం పడుతోందని ప్రజలు వాపోతున్నారు. గత ఎన్నికల సందర్భంగా నిజాంపేట ఎక్స్‌రోడ్డు నుంచి మల్లంపేట వరకు రేడియల్ రోడ్డు విస్తరణ



చేపడతామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేడియల్ రోడ్డు నిర్మాణం సంగతి పక్కనపెడితే, ప్రస్తుతం ఉన్న రహదారులకే మరమ్మతులు లేక గుంతలమయంగా మారాయని స్థానికులు అంటున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చడంలో ఇంజినీరింగ్ అధికారులు విఫలమవుతున్నారని, అక్కడక్కడ చేసిన మరమ్మతులు కూడా నాసిరకంగా ఉండటంతో కొద్ది రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిజాంపేట అంబేద్కర్ విగ్రహం వద్ద, జర్నలిస్ట్ కాలనీ, వాటర్ ట్యాంక్ నుంచి బండారి లేఔట్ వరకు రహదారులను అభివృద్ధి చేయాలని ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించలేదని బీజేపీ నాయకుడు బిక్షపతి యాదవ్ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిజాంపేట సర్కిల్ పరిధిలోని ప్రధాన, అంతర్గత రహదారులను తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ధర్మచక్ర పరివర్తన దినోత్సవం సందర్భంగా ఘనంగా కొవ్వొత్తుల ప్రదర్శన

మిర్యాలగూడ ప్రతినిధి// జూలై 29:(తెలంగాణ పత్రిక):-

ఆషాఢ పౌర్ణమి రోజున బౌద్ధ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ధర్మచక్ర పరివర్తన దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడలో సామాజికవేత్త డాక్టర్ జె. రాజు ఆధ్వర్యంలో ఘనంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. గౌతమ బుద్ధుడు బోధి వృక్షం క్రింద జ్ఞానోదయం పొందిన అనంతరం, సారనాథ్‌లోని ఋషిపట్నం మృగదావనం లో తన తొలి ఐదుగురు శిష్యులైన కొండన్న (కౌండిన్యుడు), వప్ప, భద్దియ, మహానామ, అస్సజిలకు మొదటి ధర్మబోధ చేసిన పవిత్ర దినాన్నే ధర్మచక్ర పరివర్తన దినంగా ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు ఆచరిస్తారు. ఈ తొలి బోధనే "ధర్మచక్ర ప్రవర్తన సూత్రం"గా ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా బుద్ధుడు మానవాళికి చూపిన చతురార్య సత్యాలు, ఆర్య అష్టాంగ మార్గం, పంచశీల, దశ పారమితలు వంటి బోధనలు సమాజంలో శాంతి, సమానత్వం, అహింస, సత్యం, కరుణ, మానవతా విలువలకు పునాది అని



వక్తలు పేర్కొన్నారు. బుద్ధుని సందేశాలను ప్రపంచమంతటా వ్యాప్తి చేసి మానవాళి శాంతియుత జీవనాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కొవ్వొత్తులు వెలిగించి బుద్ధునికి ఘన నివాళులు అర్పించిన అనంతరం, సమాజంలో కుల, మత, వర్గ వివక్షలకు తావులేకుండా సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బుద్ధుని బోధనలను ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, మఠ్రి మీడియా అంతర్ముఖం మఠ్రి ఎలియాస్, జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్ కుమార్, బీసీ జేఏసీ కో-కన్వీనర్ దాసరాజు జయరాజు, తదితరులు పాల్గొని బుద్ధుని బోధనల ఆవశ్యకతను వివరించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-ఎస్సై ముత్తినేని సోమేశ్వర్

ఆళ్లపల్లి జూలై 29 (తెలంగాణ పత్రిక)



మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, వొర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ముత్తినేని సోమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ రైతు లు, కూలీలు మరియు సామాన్య ప్రజలందరూ తగు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామ ప్రజలు వాగులు, వొర్రెలు దాటేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాహనదారులు అనవసర ప్రయాణాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల వల్ల ఎక్కడైనా నష్టం జరిగినా లేదా సహాయం అవసరమైనా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి సహకరించాలని కోరారు. ప్రజా భద్రత దృష్ట్యా అందరూ పోలీసు శాఖ సూచనలు పాటించాలని ఎస్సై ముత్తినేని సోమేశ్వర్ కోరారు.

# పాపన్నపేట సాయిబాబా ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

-ఆలయ ప్రధాన అర్చకులు చెరువుపల్లి విశ్వనాథ శర్మ





పాపన్నపేట,జూలై 29:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేట సాయిబాబా ఆలయంలో బుధవారం రోజు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చెరువుపల్లి విశ్వనాథ శర్మ,నవీన్ శర్మలు ఉదయాన్నే స్వామీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బాబాకు 108 లీటర్లతో పాలభిషేకం నిర్వహించారు. వేడుకల సందర్భంగా కొత్త లింగాయి పల్లి గ్రామానికి చెందిన కొత్త విశాంత్ గుప్తా దంపతులు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. వేడుకల సందర్భంగా పాపన్నపేట సాయి నామస్మరణతో మారుమ్రోగింది. ఈకార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్,ఆలయ కమిటీ సభ్యులు రవీందర్ గౌడ్,కే.నరేందర్ రెడ్డి,బీకొండ రాములు నేత,దోమకొండ కిషన్ రెడ్డి,కొమ్మ కృష్ణ మూర్తి గుప్తా, బెజుగం విటలేశ్వర్ గుప్తా,ఆకుల శ్రీనివాస్, భూమాగౌడ్, ఉప్పరి వెంకటేశం, చీనూరి రాములు గుప్తా,విట వెంకటేశం గుప్తా,అచుకట్ల రమేష్, మిన్పూర్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# యూసుఫ్ పేటలో భజన మండలి భవనం ప్రారంభం

పాపన్నపేట,జూలై 29:(తెలంగాణ పత్రిక)



పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేటలో బుధవారం భజన మండలి భవనాన్ని మెదక్ జిల్లా భజన మండలి అధ్యక్షులు శ్రీజ్ఞానానంద నగునూరి సిద్దిరామయార్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత నరేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ సబిత వెంకటరెడ్డి, స్థల దాతలు బైండ్ల నారాయణ,వడ్డేపల్లి జయరాంరెడ్డితో పాటు వివిదప్రాంతాలకు చెందిన గురువర్యులు శ్రీనిశ్చలానంద క్రిష్ణయ్య శ్రీసశ్చిలా నంద నర్సింహాగౌడ్ శ్రీసదానంద విఠల్, సమరసనంద కృష్ణయ్య, సశ్చితానంద బిక్షపతి, శ్రీనిత్యానంద బాల నర్సయ్యతో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైగా వెంకటేశ్వర్లుకు పదోన్నతి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల, జూలై 29 (తెలంగాణ పత్రిక:

జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఎస్సైగా వెంకటేశ్వర్లు పదోన్నతి పొందారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెంకటేశ్వర్లలకు ఎస్సై హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండ బాధ్యతలు కూడ మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమ శిక్షణ నిజాయితీ అంకిత భావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం గౌరవం మరింత పెరిగేల విధులు నిర్వర్తించాలని సూచించారు.

## విద్యార్థిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేది గురువులు

-శిశు మందిర్ లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ముధోల్:29జూలై(తెలంగాణ పత్రిక)

విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేది గురువులేనని పాఠశాల జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేదవ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలో వేసి జ్యోతిని వెలిగించారు. విద్యార్థి దశ గురువుల పైన ఆధారపడి ఉంటుందని గురు పౌర్ణమి విశిష్టతను పూర్వ విద్యార్థి సురేష్ వక్తగా పాల్గొని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులకు తీర్చిదిద్దిన ధర్మపురి సుదర్శన్ ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షులు రవీంద్రనాథ్ పాండే, ప్రబంధకారిణి అధ్యక్షులు కొండావార్ సంజీవ్, కార్యదర్శి నిశికాంత్, సహా కార్యదర్శి దర్బార్ నవీన్, సభ్యులు సంతోష్, దత్తాత్రి,దర్బార్ నరేష్, ప్రధానాచార్యులు సారథి రాజు,ఆచార్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాపన్నపేట,జూలై 29: (తెలంగాణ పత్రిక)





రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.... యూసుఫ్ పేట గ్రామానికి చెందిన బోల వెంకటేశం(42) వ్యవసాయం చేసుకుంటూ జీవితం గడుపుతు న్నాడు. మంగళవారం సాయంత్రం కూరగాయలు తీసుకురావడానికి ఇదే గ్రామానికి చెందిన రవితో కలిసి తన టీవీఎస్ ఎక్స్ఎల్ పై పొడిచన్ పల్లి గేటు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా లక్ష్మీనగర్ గ్రామ శివారులోనికి రాగానే వెనక వైపు నుంచి వచ్చిన బొలెరో ట్రాలీ వాహనం డీకొట్టడంతో కింద పడ్డారు.తీవ్ర గాయాలతో ఉన్న వారిని స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు గమనించి వెంకటేశం అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# హైకోర్టు తీర్పును ఏకపక్షంగా ప్రచారం చేయడం సరికాదు

-సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. హైకోర్టు తీర్పులోని ఒక కోణాన్ని మాత్రమే ప్రచారం చేస్తూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కబ్జాల అంశాన్ని విస్మరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైడ్రా ఏర్పాటు లక్ష్యం చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను పరిరక్షించడమేనని ఉమామహేష్ తెలిపారు. హైడ్రా చర్యల్లో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, అక్రమ కబ్జాలపై చేపట్టిన చర్యల వల్ల ఎక్కువగా ప్రభావితమైనది కబ్జాదారులేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, అనంతరం వాటిని మధ్యతరగతి ప్రజలకు విక్రయించి మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. హైడ్రా చేపట్టిన కూల్చివేతల కారణంగా నష్టపోయిన కబ్జాదారులే కోర్టులను ఆశ్రయించి తమ ఆక్రమణలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని, పేద ప్రజలు హైడ్రాకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సీపీఐకి హైడ్రా పనితీరుపై కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, చెరువులు, కుంటల పరిరక్షణకు సంబంధించిన చర్యలకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని ఉమామహేష్ స్పష్టం చేశారు. అయితే, పరికి చెరువులో జరిగిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో హైడ్రా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజకీయ జోక్యం లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# నాయకపల్లిలో పంట మార్పిడి అవగాహన సదస్సు

-గూడూరు మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్

గూడూరు మండల ప్రతినిధి:- జూలై 29. (తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలంలోని నాయకపల్లి, చక్రు తండా గ్రామంలో ఈరోజు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు అలాగే పంట మార్పిడి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పెసర్లు, కందులు, మినుములు, ఆయిల్ ఫామ్, బొబ్బర్లు, జొన్నలు మొదలగు ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, అలాగే పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు, ఆదాయం పెరుగుతాయని, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ రైతులకు ప్రభుత్వ సూచనలు, శాఖ అందిస్తున్న సేవలు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుస్మిత, చందన, గ్రామ సర్పంచ్ వీరన్న సుజాత, ఉప సర్పంచ్ కుమార స్వామి, రాజు, రైతులు, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కస్తూరి రాములమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు భోజనలు ఏర్పాటు

విద్యార్థులకు భోజనం వడ్డించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//జూలై 29:(తెలంగాణ పత్రిక):-





మిర్యాలగూడ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఎన్ఎస్పి క్యాంప్ నందు రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ కస్తూరి ప్రభాకర్ తల్లి కస్తూరి రాములమ్మ స్మూత్యర్థం ఏర్పాటు చేసిన స్మృతి భోజనం కార్యక్రమాన్ని విద్యార్థులకు వడ్డించి ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాఠశాల టాయిలెట్స్ పెండింగ్లో ఉండగా తన దృష్టికి రాగా వెంటనే వాటిని పూర్తి చేయించడం జరిగిందని అదేవిధంగా రంగులు వేయించడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. గుడిపాటి నవీన్ మాట్లాడుతూ విద్యార్థులు బాక్సులలో చిన్న చిన్న ప్లేట్లలో అన్నం తింటున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని అందరికీ 150 ప్లేట్లను అందజేయనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తూనే మరో గ్రంథాలయ ఉద్యమాన్ని చేపట్టి పుస్తక పఠనం చేయాలని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కస్తూరి ప్రభాకర్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జాడి రాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కందుకూరి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాష్య, ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జానయ్య, ఇందిరా, వెంకటలక్ష్మి, పాఠశాల సిబ్బంది భూలక్ష్మి, బీబీ ఆయేషా, వాసు, సమీమా, మౌనిక, హారిక, వర్ష, తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం





-మానవసేవే మాధవసేవ అనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 29, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నవితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు, భక్తులు మరియు పేదలకు ప్రేమతో భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎద్దండి రాజు, ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజున ప్రతి సంవత్సరం భక్తులకు, నిరుపేదలకు అన్నదానం చేయడం తమ ట్రస్ట్ సంప్రదాయమని తెలిపారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం కంటే గొప్ప పుణ్యకార్యం లేదని, ప్రతి ఒక్కరూ కడుపునిండా భోజనం చేయాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. మానవసేవనే మాధవసేవగా భావిస్తూ సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, సామాజిక సేవలో సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎల్లప్పుడూ ముందుండి సేవలందిస్తారని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, అన్నదానం వంటి మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు ట్రస్ట్ కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ అన్నవితరణ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు ఎద్దండి రాజు–సరళ, ట్రస్ట్ కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, ముఖ్య సభ్యులు అఖిలేష్ రెడ్డి, మహేందర్, మల్కాపురం ప్రశాంత్ గౌడ్, మోత్కుపల్లి శ్రీనివాస్ యాదవ్, శివరాత్రి వెంకటేష్, వేముల సతీష్, నందగిరి సత్యం గౌడ్, వాసాల హరిప్రసాద్, గోంటి నవీన్, పబ్బ సురేష్, అడిగొప్పుల విద్యశ్రీ, ఇట్టే పూజ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి తహసిల్దార్ వనజ

ఓదెల జులై 29తెలంగాణ పత్రిక

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని రానున్న 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని అన్నారు మండల పరిధిలో ఉన్న 22 గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ బి వనజ పేర్కొన్నారు ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు కుంటలు నీటితో నిండిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని భారీ వరద ప్రవాహం సమయంలో



కాలువలు చెరువులు వంటి జల వనరుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు అంతేకాకుండా రైతులు కరెంటు బావుల కాడికి గాని బోర్ల కాడికి గాని వెళ్లి స్టార్టర్ డబ్బాలు ముట్టుకో రాదని కరెంటు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నందున ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అదేవిధంగా ఇనుప కరెంటు పోల్స్ ఇనుప తీగల కు కరెంటు అచ్చి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వాటిపై జాగ్రత్తగా ఉండాలని మరియు శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండకూడదని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు ప్రజలు వెళ్లకూడదని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

## రేపు జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

-పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్వర్టుల ప్రారంభం
-ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరు..
-కల్లూరులో ప్రజాదర్బార్

కొత్తగూడెం, జూలై 29 (తెలంగాణ పత్రిక):

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

ఉదయం 9 గంటలకు కల్లూరు మండలం నారాయణపురంలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరే మంత్రి 9.40 గంటలకు చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామానికి చేరుకుంటారు.తీ అక్కడ అంతర్గత సీసీ రోడ్లు, తక్కువస్థాయి వంతెనను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు పోకలగూడెం, 10.20 గంటలకు రవికంపాడు గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం కొత్తూరు, నర్సాపురం గ్రామాల్లో అంతర్గత



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వుటుపల్లి, రంగాపురం గ్రామాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం భీమునిగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనం, అంతర్గత సీసీ రోడ్లు, తక్కువస్థాయి వంతెనను ప్రారంభిస్తారు. అనంతరం ఎర్రగుంట గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.40 గంటలకు ఎర్రగుంట నుంచి బయలుదేరి 3 గంటలకు కల్లూరు పట్టణంలోని మధిర 'ఎక్స్' రోడ్డులోని డీఎన్‌పీ ఫంక్షన్‌హాల్‌కు చేరుకుంటారు. అక్కడ సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించి నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు కల్లూరు నుంచి బయలుదేరి రాత్రి 9.15 గంటలకు హైదరాబాద్‌లోని హిమాయత్‌సాగర్‌లోని తన నివాసానికి చేరుకుంటారు.అధికారులకు ఆదేశాలు మంత్రి పర్యటన నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతి, భద్రత, బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారులకు సూచించారు. ఇది కావాలంటే ఇంకా పవర్‌ఫుల్ హెడ్డింగ్‌తో, మొదటి పేజీలో ప్రధాన వార్తగా కనిపించేలా మరో వెర్షన్‌గా కూడా తయారు చేయవచ్చు.

## 20 వేల లీటర్ల ఉచిత నీటి హామీ వెంటనే అమలు చేయాలి: బీజేపీ నాయకులు

మేడ్చల్ జూలై 29 తెలంగాణ పత్రిక

గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ డివిజన్ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు విక్రమ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశసేవను పరమ ధ్యేయంగా తీసుకుని పనిచేసే జాతీయవాద పార్టీ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఉచిత బియ్యం, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ నిధి తదితర పథకాలపై ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభలో ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు అభినందనలు తెలుపుతూ



ప్రత్యేక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే స్థానిక సమస్యలపై మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. గుండ్లపోచంపల్లి ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రతి ఇంటికి నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని, నల్లా బిల్లుల పెంపును ఉపసంహరించుకోవాలని, అంతర్గత రహదారులను మరమ్మతు చేయాలని, వీధిదీపాల నిర్వహణను మెరుగుపరచాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ శ్రేణులు పోరాటం కొనసాగిస్తాయని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్



మోహన్, నాయకులు కృష్ణ గౌడ్, లక్ష్మారెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హంసారాణి, డివిజన్ ఇన్‌చార్జి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు విష్ణువర్ధన్ రెడ్డి, ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, సాకారబోయిన వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, బాలకృష్ణ, గుంటి నాగరాజ్, కార్యదర్శి వాసగొని వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా సద్గురు సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్ జులై 29 తెలంగాణ పత్రిక

గురుపౌర్ణమి పురస్కరించుకొని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ సద్గురు సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నడికొప్పు నాగరాజు మాట్లాడుతూ, "గురువు అంటే గౌరవం, మార్గదర్శనం. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే మహోన్నత శక్తి గురువు. ప్రతి గురువు బోధనలు, విలువలు, ఆశీస్సులే మన విజయాలకు బలమైన పునాదులు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ధాత్రిక సింహం వంజరి, కమిటీ సభ్యులు శేఖర్, రమేష్, సంతోష్, 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గర్శాల సురేందర్ ముదిరాజ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివశంకర్ ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, గోమారం రమణారెడ్డి, ఉదండపురం సత్యనారాయణ, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, లద్దిపీర్ల రవీందర్ గౌడ్, బొక్క రఘుపతి రెడ్డి, రామన్నగారి సంతోష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, పంజగారి ఆంజనేయులు, భూపాల్ రెడ్డి, చంద్రయ్య గౌడ్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తానూర్ కస్తూర్బాపాఠశాలలో స్కావెంజర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తానూర్:29జూలై (తెలంగాణ పత్రిక)



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ నరేందర్ ఒక ప్రకటనలోతెలిపారు. బీసీ--బీ చెందిన 18 సంవత్సరాలు నిండిన, పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ దరఖాస్తులను తానూరులోని ఎంఆర్సీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

## నాయకపల్లిలో పంట మార్పిడి అవగాహన సదస్సు

-గూడూరు మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్

గూడూరు మండల ప్రతినిధి:- జూలై 29. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలంలోని నాయకపల్లి, చక్రు తండా గ్రామంలో ఈరోజు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు అలాగే పంట మార్పిడి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పెసర్లు, కందులు, మినుములు, ఆయిల్ ఫామ్, బొబ్బర్లు, జొన్నలు మొదలగు ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, అలాగే పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు, ఆదాయం పెరుగుతాయని, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ రైతులకు ప్రభుత్వ సూచనలు, శాఖ అందిస్తున్న సేవలు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుస్మిత, చందన, గ్రామ సర్పంచ్ వీరన్న సుజాత, ఉప సర్పంచ్ కుమార స్వామి, రాజు, రైతులు, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ భవనాన్ని మంజూరు చేయాలి

-బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్

ముధోల్:29జూలై(తెలంగాణ పత్రిక)



నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లోని శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని మంజూరు చేయాలని అడ్వకేట్,బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ ప్రభుత్వానికి బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనం ఎప్పుడు కూలిపోతుందోనని అధికారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నరన్నారు. తహసిల్దార్ కార్యాలయం 110 సంవత్సరాల నాటిందని భవనం మొత్తం పెచ్చులతో ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రతిరోజు కార్యాలయానికి వందలాదిమంది పనుల కోసం వస్తుంటారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తెలియని పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనానికి నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. లేనియెడల బీఎస్పి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు వాగ్మా రే విలాస్, ఉపాధ్యక్షులు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి చాకటి నిఖిల్, అంబదాస్, నాయకులు సునీల్,సుదర్శన్, కరణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల ప్రత్యేక సమావేశం

తానూర్: జూలై 29: (తెలంగాణ పత్రిక)

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచులు వివిధ శాఖ అధికారులకు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, పారిశుధ్యం, జల సంరక్షణ, ఆర్థిక సంఘం నిధుల వినియోగం తదితర అంశాలపై ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఉంటుంది అని ఈ సమావేశానికి ఆయ గ్రామ సర్పంచులు, వివిధ శాఖ అధికారులు, సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

## గురుపౌర్ణమి పర్వదినాన పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 29:



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విఘ్నేశ్వర స్వామి దత్తాత్రేయ స్వామి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయలలో మాజీ శాసనసభ్యులు స్థానికులు కటకం మృత్యుంజయం ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు ఈ సందర్భంగా మృత్యుంజయం మాట్లాడుతూ గురుపౌర్ణమి ఆధ్యాత్మికత, గురువుల గొప్పతనాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు

# దంచి కొడుతున్న వానలు అన్నదాతల ఆనందం చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఓదెల జూలై 29 తెలంగాణ పత్రిక

సూపర్ ఎలినినో ప్రభావంతో వర్షాలేపడ వని అధికారులు ప్రభుత్వం గంటపదంగా చెబుతున్న దానికి భిన్నంగా మంగళవారం రాత్రి నుండి బుధవారం కురిసిన వర్షపాతం 42.8 నమోదయింది ఈ వర్షానికి పంట పొలాలు చెరువుల కనిపిస్తున్నాయి ఎక్కడ చూసిన నీరే చెరువులు మత్తడి తొక్కేందుకు పరవళ్ళు ఊరుతున్నాయి అది చూసి రైతన్న ఆనందానికి అదుపు లేకుండా పోయిందని చెప్పకనే చెప్పచ్చు ఎందుకంటే ప్రభుత్వం అధికారులు వర్షాలు లేవని వేసిన వరి పొలాలు ఎండిపోతావని నీరు లేక బోర్లు బావులు ఎక్కడికక్కడ నీరు లేక ఎండిపోవడం జరుగుతుందని రైతులు అనేక నష్ట పోవాల్సి వస్తుందని అధికారులు గ్రామాలలో అవగాహన



కార్యక్రమాలు పెట్టి చెప్పారు దానికి భిన్నంగా విపరీతమైన వర్షం కురవడంతో రైతు ముఖాలలో ఆనందం వ్యక్తం అవుతుంది ఎక్కడ చూసినా వర్షపు నీరే ఏ పొలంలో చూసిన వర్షపు నీరే పొలాలన్నీ చెరువుల కనబడుతున్నాయి చెరువులు నిండికుండలా మారి సాగునీరు అందించేందుకు సై అంటున్నాయి.



చెరువుల తలపిస్తున్న వరి పొలంలో వర్షపు నీరు

బుధవారం కురిసిన భారీవర్షానికి కొమి ర నుండి మల్లికార్జున స్వామి ఆలయానికి పోయే దారిలో కొత్తచెరువు సమీపంలో చెరువును తలపిస్తున్న పంట పొలాల్లో వర్షపు నీరు

# ఫీజుల బకాయి బీజేపీ లడాయి

-ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా యువ మోర్చా ( బిజెవైఎం) ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 29 తెలంగాణ పత్రిక

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం



పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయని పక్షంలో 'ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి' ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, బీజేపీ సీనియర్ నాయకులు సాదం అరవింద్, జంగం వీరేష్ , జమాల్, జుట్టు దినేష్,ఇర్ల విజయ్, శ్రీకాంత్ రెడ్డి,కందుల హరీష్, భరత్ కౌన్సిలర్లు రాజు, నరేష్, శశాంక్ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవుని ఆవును అమ్ముకున్న వి డి సి చైర్మన్

-ఇచ్చేది ఒకరు అమ్ముకునేది ఇంకొకరు
-కాల్వ గ్రామంలో కలకలం రేపుతున్న ఆవు అమ్మకం

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 29 (తెలంగాణ పత్రిక)

నిర్మల్ జిల్లా దిలవర్ పూర్ మండల్ కాల్వ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కి కాల్వ గ్రామానికి చెందిన ఒక భక్తుడు కామెండ్ల భోజన్న గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుడికి మొక్కుబడిగా ఆవుని వదిలాడు ఆ యొక్క దేవుడి ఆవుని అదే గ్రామానికి చెందిన వీడీసీ చైర్మన్ ఆవును దిలావర్ పూర్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఏప్రిల్ నెలలో బేరం కుదుర్చుకొని 9వేలకు బేరం కుదరగా కాల్వ గ్రామానికి చెందిన వీడీసీ చైర్మన్ కు ఫోన్ పే ద్వారా



డబ్బులు పంపి ఆ యొక్క ఆవుని తీసుకొని పోయాడు ఈనెల రెండు మూడు రోజుల క్రితం గ్రామస్తులు అందరూ కలిసి ఆ యొక్క ఆవు ఎటు పోయింది అని గ్రామస్తులు విచారణ చేపట్టగా కాల్వ గ్రామానికి సంబంధించిన విడిసి చైర్మన్ అమ్ముకున్నాడని బయటపడింది

వి డి సి చైర్మన్ పై కేసు నమోదు చేస్తాం కాల్వ గ్రామస్తులు ఆలయ ఈవో భూమయ్య

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ఎవరైనా భక్తులు ఆవులను మొక్కుబడిగా ఇస్తారు కావున కాల్వ గ్రామంలో కాల్వ గ్రామానికి చెందిన ఒక ఆవుని వి డి సి చైర్మన్ అమ్ముకున్నాడని గ్రామస్తులు ఈవో భూమయ్యకు సమాచారం ద్వారా అందించడంతో గ్రామస్తులు మరియు ఈవో దిలావర్ పూర్ ఎస్సై గారికి ఫిర్యాదు చేయడంతో దిలావర్ పూర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు

# నోటీసులు లేకుండానే దుకాణాల కూల్చివేత.. బాధితులకు న్యాయం చేయాలి

-షాపూర్‌నగర్ ఘటనపై బీఆర్ఎస్ ఆందోళన..
-ఎమ్మెల్యే కేపీ వివేకానంద జోక్యంతో చర్యలకు హామీ

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29: షాపూర్‌నగర్:

షాపూర్‌నగర్ రాజీవ్ పార్కు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారుల దుకాణాలను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం దురదృష్టకరమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సుమారు 12 దుకాణాలను సిఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించడంతో బాధిత కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను బీఆర్ఎస్ నాయకుడు అన్వర్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా,



ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధిత వీధి వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు జారీ చేయకుండా నిరుపేదల జీవనాధారమైన దుకాణాలను కూల్చివేయడం మానవత్వానికి విరుద్ధమని అన్నారు. వీధి వ్యాపారుల హక్కులను పరిరక్షిస్తూ వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మంగపేట ఎస్సై టి.వి.ఆర్. సూరి

మంగపేట, జూలై 29:(తెలంగాణ పత్రిక)

ములుగు జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, విపత్తు నిర్వహణ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని మంగపేట పోలీస్ స్టేషన్ ఎస్సై టి.వి.ఆర్. సూరి కోరారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రాణాలను పణంగా పెట్టి వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో లోతు తెలియకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట్లకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని




అన్నారు.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను పాటించాలని కోరారు. ప్రతి కుటుంబం అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పొడి ఆహారం, టార్చ్‌లైట్, మందులు, మొబైల్ పవర్ బ్యాంక్, అవసరమైన పత్రాలను సురక్షితంగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగుల భద్రతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎలాంటి వరద పరిస్థితులు, ప్రమాదాలు లేదా అత్యవసర సంఘటనలు ఎదురైనా ఆలస్యం చేయకుండా వెంటనే 112 ఎమర్జెన్సీ సేవలకు లేదా మంగపేట పోలీస్ స్టేషన్ హెల్ప్‌లైన్ నంబర్లు 8712670093, 8712670092కు సమాచారం అందించాలని ఎస్సై టి.వి.ఆర్. సూరి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు మంగపేట పోలీసులు 24 గంటలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# ఉర్దూ అకాడమీ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం మానుకోవాలి

-టికేఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలి

ఆత్మకూరు జూలై 29, (తెలంగాణ పత్రిక): .



తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు సంస్థకు అప్పగించడం సరికాదని తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలి అన్నారు. 30 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు మైనారిటీ సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో 20 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని 1.04 ఎకరాల భూమిని 30 ఏళ్ల రూ.5 వేలకు మాత్రమే లీజుకు ఇవ్వడం పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రజా ప్రకటన లేకుండా, పోటీ టెండర్లు లేకుండా లీజు ఇవ్వడం పారదర్శకతకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవోను ఉపసంహరించుకోవాలకోరారు, అలా జరగని పక్షంలో మైనారిటి సోదరులను ఏకం చేసి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# 108 లో ప్రసవం తల్లి,బిడ్డ క్షేమం

మాదుగులపల్లి//నల్గొండ//జులై 29:(తెలంగాణ పత్రిక):-



ఆపద సమయంలో ఎన్నో ప్రాణాలను కాపాడుతూ 108 ప్రథమ స్థానంలోనే ఉందని దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి ప్రమాదం జరిగిన క్షణాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుంటూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతూ 108 సిబ్బంది మన్నలను పొందుతున్నారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మాదుగులపల్లి మండలం చర్లగూడెం గ్రామానికి చెందిన రేణుక పురిటి నొప్పులతో బాధపడుతూ రాత్రి సమయంలో 108ని సంప్రదించగా వారు వెంటనే గ్రామానికి వెళ్లి పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళలు 108 లో నల్లగొండ కు తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలోనే 108 సిబ్బంది ఎలాంటి ప్రమాదం జరగకుండా డెలివరీ చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి రమ్య, పైలెట్ శ్రవణ్ తెలిపారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందిని ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రసవం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ విద్యార్థి పరిషత్ 15వ ఆవిర్భావ పోస్టర్ల విడుదల టీజీవిపి



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 29 (తెలంగాణ పత్రిక)

తెలంగాణ విద్యార్థి పరిషత్ 15వ ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రులను గాంధీ పార్క్ ఎదుట కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా విద్యా శాఖ అధికారి దర్శనం భోజన్న ప్రైవేటు పాఠశాలల ట్రస్మా నిర్మల్ టౌన్ అధ్యక్షులు పడాల చంద్ర గౌడ్ గారు ముఖ్యఅతిథిగా నిర్మల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్ కుమార్ తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ విద్యార్థులకు అండగా నిలుస్తూ అనాదికాలంలోనే ప్రశ్నించే గో తకగా గా పేరు సంపాదించింది తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తెలంగాణ రాష్ట్రం విద్యార్థుల సమస్యల పరిష్కారమే ఏకైక ఎజెండాగా పనిచేస్తుందని టీజీవిపి పోరాట ఫలితాంగానే విద్యార్థుల సమస్యలు పరిష్కరించబడ్డాయని ఫీజు రియంబర్స్మెంట్ హాస్టల్ లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిరంతర పోరాటం చేస్తున్నాం భవిష్యత్తులో కూడా విద్యారంగ సమస్యలపై సామాజిక సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటాం ప్రభుత్వం ఏదైనా సరే విద్యార్థుల పక్షన పోరాటం చేయడమే మా విధి అన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ టౌన్ అధ్యక్షులు ఆత్మరాం అర్జున్ సిద్దు దినేష్ జాదవ్ శ్రీకాంత్ నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దూలపల్లి--జీడిమెట్ల రోడ్డు పనులు వేగవంతం చేయాలి

**-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి**

**-క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:** దూలపల్లి కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లి పారిశ్రామికవాడలో జీడిమెట్ల ఐడీఏ జంక్షన్ నుంచి దూలపల్లి ఎన్టీఆర్ చౌరస్తా వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ, నూతన రహదారి నిర్మాణ పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పారిశ్రామిక వాడలో రవాణా రద్దీని తగ్గించడంతో పాటు పరిశ్రమలు, స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ రహదారి కీలకంగా మారనుందని అన్నారు. సుమారు 2.20 కిలోమీటర్ల పొడవు, 50 అడుగుల వెడల్పుతో రూ. 10.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం ఉన్న 20 అడుగుల రహదారిని 50 అడుగులకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే భారీ వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు దూలపల్లి, కొంపల్లి, జీడిమెట్ల తదితర ప్రాంతాల ప్రజలకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా 153



విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను సంబంధిత శాఖలు అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న 66 చెట్లను పర్యావరణానికి హాని కలగకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించే చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు వేగంగా సాగినా పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అదేవిధంగా రహదారి విస్తరణలో భాగంగా నాలాలపై నిర్మించాల్సిన కల్వర్టుల పనులను ఆలస్యం చేయకుండా పూర్తిచేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో నీరు నిలిచిపోయే పరిస్థితులు తలెత్తకుండా నాణ్యతతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దూలపల్లి--జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించే ఈ రహదారి పరిశ్రమల అభివృద్ధికి, సరుకు రవాణాకు కీలకంగా మారనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెవెన్యూ,



విద్యుత్, మున్సిపల్, రోడ్లు-భవనాల శాఖలతో పాటు అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో పారిశ్రామికవాడలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, వాహనదారులకు ముందస్తు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఏఈఈ నరేష్, మాజీ ప్రజాప్రతినిధులు చింతల దేవేందర్ యాదవ్, సురేష్ రెడ్డి, దప్పు కిరణ్, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, నాయకులు వెంకటేష్, మహేష్, మధు, వారాల వినోద్, బర్మా రాజు, బర్మా ప్రవీణ్, బర్మా శ్రీకాంత్, మంత్రి రఘు, గుర్రాల గోపాల్, గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్, ఇస్మాయిల్, శేషాచారి, దూలపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు సాంబశివరావు, జీడిమెట్ల ఐడీఏ అధ్యక్షుడు సాయి కిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత పోరాట యోధుడు కుసపాటి శ్రీనివాస్‌కు దక్కిన గౌరవం

**-తెలంగాణ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 (తెలంగాణ పత్రిక):** దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కుసపాటి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. దళిత వర్గాల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాజిక న్యాయం కోసం తనదైన శైలిలో పోరాటం చేస్తున్న కుసపాటి శ్రీనివాస్‌కు ఈ పదవి దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి



చేయాలని పలువురు ఆకాంక్షించారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..**

పదవి తనకు లభించిన గౌరవం మాత్రమే కాకుండా మరింత బాధ్యతను పెంచిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మరింత కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. కుసపాటి శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

**-ప్రజలను అప్రమత్తం చేసిన ఎంపీడీఓ ఎస్ఐ**

**ఓదెల జూలై 29 తెలంగాణ పత్రిక**

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు వరద ప్రభావిత ప్రాంతం కొలనూర్. గూడెం మరియు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఓదెల ఎంపీడీఓ అనిల్ రెడ్డి మరియు పోత్కపల్లి ఎస్ఐ సనాత్ కుమార్ రెడ్డి బుధవారం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని రోడ్లు, కాజ్‌వేలు కల్వర్టు లు మరియు వర్షపు నీరు నిలిచిపోయిన లోతట్టు ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట్ల ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలకు అప్రమత్తత అవసరం:



వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున కల్వర్టులు, వరద నీరు పారే రహదారులను దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను కోరారు. పిల్లల సంరక్షణ: చిన్న పిల్లలను ప్రమాదకర ప్రాంతాలు మరియు నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.



అత్యవసర సహాయం: ఏ విధమైన అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్థానిక అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అధికారులతో పాటు స్థానిక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


# సాయిబాబా నగర్ బాధితులకు న్యాయం కోసం కృషి చేస్తా

**-కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:** సూరారం సాయిబాబా నగర్ ఫేజ్-1లోని సర్వే నంబర్ 49/6లో నివసిస్తున్న 120 కుటుంబాల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హామీ ఇచ్చారు. తమ ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేతలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబాలు మాజీ ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించాయి. సాయిబాబా నగర్ ఫేజ్-1లోని సర్వే నంబర్ 49/6లో ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న తమ ఇళ్లను ప్రభుత్వ స్థలాల్లో నిర్మించారని పేర్కొంటూ స్థానిక రెవెన్యూ అధికారులు ఇటీవల పరిశీలనలు చేపట్టి కూల్చివేత చర్యలు ప్రారంభించారని బాధితులు తెలిపారు. తమకు న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు కూన శ్రీశైలం గౌడ్‌ను కోరారు. బాధితుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం షాపూ ర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కూన శ్రీశైలం గౌడ్ కలుసుకున్నారు. మంచినీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం వంటి స్థానిక సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.




# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా వందశాతం పూర్తి చేయాలి

**-ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి:**

**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమన్వయంతో, పారదర్శకంగా వందశాతం పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి కోరారు. బుధవారం ములుగు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను బూత్ లెవల్ అధికారులు బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌ఏలు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఒక ఓటరుకు ఒకే ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు ప్రాంతాల్లో ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. రెండు ప్రాంతాల్లో పేర్లు ఉన్న ఓటర్లు తాము ఓటు కొనసాగించదలిచిన ప్రాంతాన్ని నిర్ణయించుకుని, సంబంధిత బీఎల్‌వో ద్వారా మరో ప్రాంతంలోని ఓటును తొలగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, స్థల మార్పు, అవసరమైతే పోలింగ్ కేంద్రాల విలీనం, తొలగింపుకు సంబంధించిన ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా వెంకటాపూర్ మండల పరిధిలో సుబ్బక్కపల్లి, పెరకపల్లి, ములుగు మండల పరిధిలో చింతకుంట, జగ్గన్నపేట, ఏటూరునాగారం మండల పరిధిలో ఎలిశెట్టిపల్లి గ్రామాల్లో మొత్తం ఐదు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మూడు పోలింగ్ కేంద్రాల స్థలాలను మార్చడంతో పాటు నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని అన్‌మ్యాప్డ్, గైర్హాజరు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, ద్వంద్వ నమోదైన ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేస్తామని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలు అందించాలని కోరారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు తమ పరిధిలో ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, పత్రాలను త్వరితగతిన పూర్తి చేసి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి భాస్కర్, సీపీఎం పార్టీ ప్రతినిధి రాజేందర్, బీజేపీ పార్టీ ప్రతినిధి రవీంద్రాచారి, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సుమన్ పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, ప్రతినిధి జూలై 29 ( తెలంగాణ పత్రిక )**

పెద్దపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో జూలై 30, 2026న పెద్దపల్లి టాస్క్ రీజనల్ సెంటర్ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో, బస్ డిపో (ప్రాంగణం)లో ప్రత్యేక నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సమీపంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలో ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా మరియు డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు ?18,000 నుండి ?21,000 వరకు వేతనంతో పాటు పి ఎఫ్ ఈ ఎస్ ఐ ఉచిత భోజనం రవాణా సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.అదే రోజు బీఎస్సీ కెమిస్ట్రీ మరియు బీఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం మూడు నెలల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్కు నమోదు మరియు ఎంపిక ప్రక్రియ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు.జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు మరియు ఇతర అవసరమైన పత్రాలతో జూలై 30, 2026న ఉదయం 10.00 గంటలకు పెద్దపల్లిలోని టాస్క్ రీజనల్ సెంటర్ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో, బస్ డిపో (ప్రాంగణం) వద్ద జరిగే ఇంటర్వ్యూలు నమోదు ప్రక్రియకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు సెగ్రిగేషన్ బిన్‌లను తనికి చేసిన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూలై 29:**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 అనుసరించి, 4-వే సెగ్రిగేషన్ ప్రక్రియపై అన్ని గ్రామ పంచాయతీల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అవగాహన కల్పించే భాగంగా, ఎక్కువ మంది సందర్శకులు మరియు ప్రజలు ఉండే 9 కార్యాలయాలకు (కలెక్టరేట్,గెస్ట్ హౌస్, ఏరియా హాస్పిటల్,కార్యాలయం, కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్,కార్యాలయం, సఖి సెంటర్ కార్యాలయం. )4-వే డస్ట్ బిన్ సెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారం చేసి, నియమాలు 2026 ప్రకారం సరైన విధంగా వ్యర్థాల విభజన జరిగేలా చూడాలని డి పి ఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య వ్యర్థాల విభజన ప్రక్రియపై వివరించారు.

**వ్యర్థాల విభజన వివరాలు:**

పచ్చ బిన్: తడి వ్యర్థాలు (జీవఅధోకృత వ్యర్థాలు)నీలి బిన్: పొడి వ్యర్థాలు ఎరుపు బిన్: శానిటరీ వ్యర్థాలు

నలుపు బిన్: ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుతడి వ్యర్థాలు: వంట చెత్త (వేసిన మరియు వేయని), కూరగాయల తొక్కలు, పండ్ల వ్యర్థాలు, ఆకులు, తోట వ్యర్థాలు, ఇతర పదార్థాలు, మొదలైనవి.

పొడి వ్యర్థాలు: ప్లాస్టిక్ (బాటిళ్లు, కంటైనర్లు, సంచులు, మొదలైనవి), పేపర్ (వార్తాపత్రికలు, కార్డ్‌బోర్డ్, పుస్తకాలు, మొదలైనవి), గాజు (బాటిళు ్ల, జాడీలు, మొదలైనవి), లోహం (క్యాన్లు, ఫాయిల్, మొదలైనవి), టెక్స్‌టైల్స్ (బట్టలు, గుడ్డలు, మొదలైనవి), ఇతర పునర్వినియోగపరచదగిన పదార్థాలు.

శానిటరీ వ్యర్థాలు: ఉపయోగించిన శానిటరీ నేప్‌కిన్లు, డైపర్లు, అడల్ట్ డైపర్లు, కాండమ్స్, ఇతర సారూప్య వ్యర్థాలు.

ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలు: బ్యాటరీలు, ఇ-వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ పరికరాలు, భాగాలు), ప్రమాదకర రసాయనాలు, పురుగునాశకాలు, మెడికల్ వ్యర్థాలు (శానిటరీ వ్యర్థాలు మినహా), ఆరోగ్యానికి లేదా పర్యావరణానికి ప్రమాదం కలిగించే ఇతర వ్యర్థాలు.

ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ. రఫీక్, కన్సల్టెంట్స్ షర్పునిసా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

**చీకుపల్లి--పెద్దగొల్లగూడెం ఇసుక వాగు రోడ్డు పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూలై 29:**

జిల్లా లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం వాజేడు మండలం చీకుపల్లి--పెద్దగొల్లగూడెం ఇసుక వాగు డైవర్షన్ రోడ్డు పరిస్థితిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారి పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబధిత అధికారులను ఆదేశించారు. వాజేడు మండలాల పరిధిలో చీకుపల్లి--పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు దెబ్బ తినడంతో తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి--163పై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలపడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వరద ప్రవాహం తగ్గిన అనంతరం ప్రత్యామ్నాయ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రస్తుత వరద ఉధృతి అధికంగా ఉండటంతో పైపులు దెబ్బతినకుండా డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వి నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్డును తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్పీ మనన్ భట్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంటికి కన్నెం వేసిన దొంగలు

**-9 తులాల బంగారం 16 తులాల వెండి 30 వేల నగదు లూటీ**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 29**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో భారీ చోరీ కలకలం రేపింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు పూర్తి వివరాల లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన పత్తి స్వామి కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వెళ్లిన విషయం గమనించిన గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి



లోనికి ప్రవేశించారు ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం 16 తులాల వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ,



వెంకటేష్ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ చోరీ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు

# శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడపడం ప్రభుత్వానికి సరికాదు

**బిఎస్పీ నిర్మల్ జిల్లా అడ్వకేట్ జగన్ మోహన్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 29 (తెలంగాణ పత్రిక)**

ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది ప్రమాదం జరిగితే బాధ్యత ప్రభుత్వానిదే వెంటనే నూతన భవనం నిర్మించకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని అడ్వకేట్ జగన్ మోహన్ మీడియాతో మాట్లాడుతూ... ముదోల్ తహసీల్దార్ కార్యాలయం 110 సంవత్సరాల నాటి శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే నిజాం సర్కారు కాలంలో నిర్మించిన,1956 బాషా సంయుక్త రాష్ట్రాలవిభజనలో నాందేడ్ జిల్లా నుండి 2014 తెలంగాణ ఎర్పాటు తర్వాత 2016 నిర్మల్ జిల్లాలో కొనసాగుతుండటం నేడు రాష్ట్ర ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ తీవ్రంగా విమర్శించారు. ప్రతిరోజూ వందలాది మంది రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు మరియు కార్యలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, ఈ కార్యాలయానికి వస్తున్నా, ఎప్పుడు కూలిపోతుందో తెలియని భవనంలో ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనన్నారు.ఈ భవనంలో చిన్న ప్రమాదం జరిగినా భారీ ప్రాణనష్టం



సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే ప్రభుత్వం, ప్రజలకు కనీస భద్రత కలిగిన కార్యాలయ భవనాన్ని కూడా కల్పించలేకపోవడం పూర్తిగా పాలనా వైఫల్యమని మండిపడ్డారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లో చాలా ప్రాంతాలు నిర్లక్ష్యంకు గురి అయ్యాయని అందులో ముదోల్ నియోజకవర్గం చాలా వెనుకబడ్డ దని, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యపెట్టి నదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో కోట్ల రూపాయల హామీలు ఇచ్చిన ప్రభుత్వం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మాత్రం పూర్తిగా విస్మరించిందన్నారు. బీఎస్పీ డిమాండ్లు: వెంటనే ముదోల్ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలి. అప్పటి వరకు కార్యాలయాన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయ భవనానికి తరలించాలి. జిల్లాలోని అన్ని శిథిల ప్రభుత్వ భవనాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, ధర్నాలు, ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాం. ప్రజల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వాన్ని బీఎస్పీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని వెంటనే తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్,నియోజకవర్గం అధ్యక్షులు వాగ్మారే విలాస్,జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ యాదవ్,నియోజకవర్గం ప్రదాన కార్యదర్శి చాకటి నిఖిల్,దగ్డే అంబదాస్,పార్టీ సీనియర్ నాయకులు సింగారే సునీల్,వాగ్మారే సుదర్శన్,దగ్డే కరణ్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

**-కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి..ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**-వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలన**

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:**

కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇప్పటికే కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చింతల చెరువును సందర్శించి చెరువు అభివృద్ధి, సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం



చేపట్టాలని కోరుతూ వోక్షిత్ హిల్ వ్యూ కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ప్రధాన రహదారి, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్, భూగర్భ డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో కోట్లాది రూపాయల నిధులతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు భూగర్భ డ్రైనేజీ అవుట్‌లైన్ సమస్యను కూడా పరిష్కరించి అభివృద్ధి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



కాలనీ చుట్టూ ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి, పరిశుభ్రతను పాటించాలని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ డీసీ వెంకట్ రాములు, ఆర్ఐ ఖలీల్, ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ కళ్యాణ్, వాటర్ వర్క్స్ జీఎం రవి నాయక్, వోక్షిత్ హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, ఫౌండర్ సోమిరెడ్డి, కమిటీ సభ్యులు సురేందర్ బాబు, చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ వాసులు, మహిళలు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవకతవకల ఆరోపణలపై విచారణ

**-అంగన్వాడీ టీచర్ కు మెమో జారీ**

**నంగునూరు, జూలై 29(తెలంగాణ పత్రిక):**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో అవకతవకలు జరిగాయని చేసిన ఫిర్యాదుపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నిర్వహించిన ఈ విచారణలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అంగన్ వాడీ టీచర్ వాంగ్మూలాలను నమోదు చేశారు. విచారణలో వెలుగు చూసిన అంశాల ఆధారంగా సంబంధిత అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. అంక్షాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాయోజు పద్మ--బుచ్చి వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన విచారణకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇంఛార్జి అధికారి (డీడబ్ల్యూఓ) సీహెచ్.శారద హాజరయ్యారు. గ్రామ ప్రజలు, అంగన్ వాడీ లబ్ధిదారులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అంగన్ వాడీ టీచర్ వివరణను స్వీకరించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ ఇన్‌చార్జి శారద మాట్లాడుతూ, విచారణలో గుర్తించిన అంశాలపై సంబంధిత అంగన్ వాడీ సిబ్బందికి మెమో జారీ చేస్తామన్నారు. పూర్తి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అంగన్ వాడీ కేంద్రాలు నిర్వహించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పోషకాహారం, సంక్షేమ సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు




తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు పునరావృతం అయితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణ సందర్భంగా గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తమ సమస్యలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. వాటిని నమోదు చేసి పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# చెత్త సేకరణ కార్మికుల హక్కులను కాపాడాలి..





-కుత్బుల్లాపూర్‌లో 'రామ్కీ గో బ్యాక్' కార్యక్రమం
-గుత్తేదారుల పెత్తనాన్ని సహించం..
-ప్రైమరీ కలెక్షన్ బాధ్యత కార్మికులకే కొనసాగించాలి.. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 29:

చెత్త సేకరణ కార్మికుల ఉపాధి భద్రతను కాపాడాలని, వారి హక్కులకు భంగం కలిగించే చర్యలను అడ్డుకోవాలని ఎమ్మెల్సీ, సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. గుత్తేదారుల పెత్తనాన్ని సహించబోమని, ప్రైమరీ చెత్త సేకరణ వ్యవస్థను ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకే కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ జోన్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ ఆధ్వర్యంలో ఐడీపీఎల్‌లోని ఎల్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'రామ్కీ గో బ్యాక్' కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ కార్మికుల సమస్యలు, వారి ఉపాధి భద్రత, గుత్తేదారుల జోక్యంపై ఆయన మాట్లాడారు. ప్రజల కోసం ప్రతిరోజూ కష్టపడుతున్న చెత్త సేకరణ కార్మికుల పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతీయకూడదన్నారు. పని చేస్తున్నది కార్మికులే అయినప్పుడు, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రయోజనం కూడా వారికే అందాలని పేర్కొన్నారు. కార్మికుల జీవనోపాధిపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే ముందు ప్రభుత్వం వారి సమస్యలను కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ప్రైమరీ చెత్త సేకరణ బాధ్యతలను ప్రస్తుతం పనిచేస్తున్న స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులకే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవనాధారం ఈ రంగంపై ఆధారపడి ఉందని, వారి ఉపాధికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ మాట్లాడుతూ, కార్మికుల పొట్టకొట్టే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్మికుల హక్కులను హరించే చర్యలను అడ్డుకుంటామని, అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, స్టీఫెన్, లక్ష్మారెడ్డి, కృష్ణ, వెంకన్న, నరసింహ, రంగన్న, మల్లేష్, అంజి, జగదీష్, ఉత్తరయ్య, ప్రశాంత్, దస్తగిరి, రవి, రామకృష్ణ, అల్వాల్ శ్రీను తదితరులతో పాటు కుత్బుల్లాపూర్ జోన్‌కు చెందిన స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు కొనసాగిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.

# గురు కృపతో ఆత్మకూర్ లో ఆధ్యాత్మిక వెల్లువ

- షిరిడి సాయిబాబా ఆలయంలో వైభవంగా గురు పౌర్ణమి ఉత్సవాలు
- పల్లకి సేవ, మహా అన్న ప్రసాదం, భక్తులతో కిటకిటలాడిన ఆలయం

ఆత్మకూర్, జూలై 29, (తెలంగాణ పత్రిక):



ఆత్మకూరు మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రాంపల్లి పవన్ కుమార్ శర్మ, మనోజ్ ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుందరంగా అలంకరించిన పల్లకిలో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో బ్యాండ్ మేళాలు, భక్తి గీతాల నడుమ ఊరేగించారు. దారి పొడవునా భక్తులు మంగళహారతులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటూ బాబా ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, వేలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం అంతటా సాయినామ స్మరణ మార్మోగి భక్తిమయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ కోమాండ్ల చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రేవూరి సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర సతీష్, ట్రస్ట్ సభ్యులు సముద్రాల విజేందర్, కరివేద మహేందర్ రెడ్డి, ఉప్పుల మొగిలి, పడాల భాస్కర్‌తో పాటు పలువురు భక్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ శ్రీ రామ్ రావ్ మహారాజ్ జయంతి వేడుకలు

-దేవుని గుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో

కోటగిరి తెలంగాణ పత్రిక జూలై 29.



కోటగిరి మండలంలోని దేవుని గుట్ట గ్రామంలో సంత్ శ్రీ రామ్ రావ్ మహారాజ్ 91వ. జయంతి వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ కోలా సీతారాం నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయక్ కారోబార్ తాండవాసులందరూ కలిసి భోగి బండార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ జయంతి సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సీతారాం నాయక్ మాట్లాడుతూ... రమావత్ గోత్రానికి చెందిన ఏడవ తరం వారసులు పౌరాదేవి క్షేత్రంలోని వాషింగ్ జిల్లా మహారాష్ట్ర వారు ప్రతి తాండాలలో తిరుగు మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ మూఢనమ్మకాలను నమ్మొద్దు అని ప్రచారం చేస్తూ తాండవాసులందరికీ ఏకతాటిపై తీసుకొచ్చి వాళ్ళ అభివృద్ధి కొరకు జీవితాంతం కృషి చేసిన మహా గొప్ప వ్యక్తులని కొనియాడారు. ప్రతి తాండలలో గుడి బడి ఉండాలని సద్గురు మార్గంలో నడవాలని, దైవ మార్గంలో నడవాలని యువకులందరూ చదువు పై శ్రద్ధ చూపి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల కోరికలను నెరవేరుస్తూ ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని తాండవ వాసులందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్ర రవి నాయక్ ఆలయ కమిటీ చైర్మన్ సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు సీతారామ్ నాయక్ దేవుని గుట్ట తాండ కారోబారి గుగులోత్ దేవుల నాయక్ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు పక్కిరా నాయక్ సేవలాల్ సేన మండల అధ్యక్షులు తారాసింగ్ ఉపాధ్యక్షులు రామ్ కిషన్ మెగావత్ పుండలిక్ రావు కేతావత్ సురేష్ వడిత్య తారాసింగ్ కొర్ర విట్టల్ శంకర్ యశ్వంత్ ధన్సింగ్ రూప్ సింగ్ రామచందర్ రాము గ్రామ ప్రజలు తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో దేశీయ వ్యవసాయం దివాలా

-రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న చలో జైల్ భరో
-కేంద్ర ప్రభుత్వం దేశీయ వ్యవసాయాన్ని రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలి లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తాం
-ఎం సి పి ఐ (యు) రాష్ట్ర కమిటీ సమావేశం పోలీస్ బ్యూరో సభ్యుడు వల్లపు ఉపేందర్ రెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//జూలై 29:(తెలంగాణ పత్రిక):-



విదేశీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో దేశీయ వ్యవసాయం దెబ్బతిని రైతాంగం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఎంసిపిఐ(యు) పోలీస్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆగస్టు 10న క్విట్ ఇండియా స్ఫూర్తితో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ రైతు కార్మిక ప్రజా సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా జైల్ భరో ఆందోళన కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. భారత మార్కెట్ కమ్యూనిస్టు పార్టీ ఐక్య ఎంసిపిఐ యు రెండు రోజుల రాష్ట్ర కమిటీ సమావేశాలు నల్గొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదులు అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి పకృతి వైపరీత్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశీయ రైతాంగానికి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు మరింత ఊబిలోకి నెట్టివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైతాంగం ప్రధానంగా పండించే పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, పాల, ఉత్పత్తులు సరైన మార్కెట్ సౌకర్యం లేక పెట్టిన ఖర్చులు రాక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అమెరికా లాంటి దేశాల నుంచి ఎలాంటి పన్నులు విధించకుండా స్వేచ్ఛగా దిగుమతి చేసుకోవడం అన్యాయమని అన్నారు. అమెరికా లాంటి దేశంలో రైతులు పంటలకు సుమారు 60శాతం పైగా సబ్సిడీలు ఇచ్చి పంటలను పండిస్తున్నారని ఈ క్రమంలో చౌకగా పంటలను అమ్ముకుంటున్నారని కానీ మనదేశంలో అలాంటి పరిస్థితి లేదని ఈ క్రమంలో ఇతర దేశాల పంటల ఉత్పత్తులకు దేశీయ పంటల ధరలకు వ్యత్యాసం తీవ్రంగా ఉంటుందని అందుకని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే ఉపసంహరించుకొని దేశీయ రైతాంగాన్ని వ్యవసాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మరోవైపు కార్మికులకు వ్యవసాయ కూలీలకు హాని కలిగించే విధంగా చట్టాలను రూపొందించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యవసాయాన్ని రైతాంగని ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఈ క్రమంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైలు బరో ఆందోళన కార్యక్రమాన్ని జిల్లా మండలాల కేంద్రాల్లో కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రైతు డిస్కం వ్యతిరేకంగా బషీర్బాగు విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఆగస్టు 28న జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాలు చేపట్ల ఉన్నట్టు తెలిపారు.

# ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం.

-సవాళ్ల మధ్య మీడియా స్వేచ్ఛ-

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29:



ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు మీడియాను నాలుగో స్థంభంగా అభివర్ణిస్తారు. అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజలకు తెలియజేయడం మీడియా ప్రధాన బాధ్యత. అలాంటి మీడియాపై, ముఖ్యంగా జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే అంశంగా మారుతున్నాయి.

ప్రచురితమైన వార్తతో విభేదాలు ఉంటే ఖండించడం, వివరణ ఇవ్వడం లేదా చట్టబద్ధమైన మార్గాలను ఆశ్రయించడం ప్రజాస్వామ్య పద్ధతి. కానీ వార్త రాసిన జర్నలిస్టునే లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, దాడులు, వ్యక్తిత్వ హననం, తప్పుడు ప్రచారం లేదా వేధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఒక జర్నలిస్టుపై దాడి అంటే కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు; ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థపైనే దాడి. మీడియా స్వేచ్ఛ అనేది జర్నలిస్టుల హక్కు మాత్రమే కాదు, ప్రజలకు నిజమైన సమాచారం తెలుసుకునే రాజ్యాంగబద్ధమైన హక్కుకు కూడా సంబంధించినది. చరిత్ర చెబుతున్నది ఏమిటంటే, ఎక్కడ మీడియా స్వేచ్ఛ దెబ్బతింటుందో అక్కడ ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ప్రశ్నించే స్వరాలు మూగబోయిన చోట అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజా హక్కుల ఉల్లంఘనలు పెరిగే ప్రమాదం ఉంటుంది. అయితే మీడియా కూడా తన బాధ్యతలను మరువకూడదు. వాస్తవాలు, నిష్పాక్షికత, సామాజిక బాధ్యత అనే జర్నలిజం మూల సూత్రాలకు కట్టుబడి ఉండాలి. మతం, కులం లేదా వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్చలకు మీడియా వేదిక కాకూడదు. విభిన్న అభిప్రాయాలను సమతుల్యంగా ప్రజల ముందుంచడం మీడియా ధర్మం. సోషల్ మీడియా విస్తరణతో సమాచార వ్యాప్తి వేగవంతమైనప్పటికీ, అదే సమయంలో వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారం, జర్నలిస్టులపై ట్రోలింగ్ కూడా పెరిగింది. కొన్ని డిజిటల్ వేదికల్లో సంచలనానికి ప్రాధాన్యం పెరగడం వల్ల జర్నలిజం విలువలు దెబ్బతింటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వాస్తవ నిర్ధారణ, బాధ్యతాయుతమైన ప్రచారం మరింత అవసరం. వార్తల్లో పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దేందుకు చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి. ఖండనలు పంపవచ్చు, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు, ప్రెస్ కౌన్సిల్ వంటి సంస్థలను సంప్రదించవచ్చు. కానీ హింస, బెదిరింపులు లేదా వ్యక్తిగత దాడులు ఎప్పటికీ ప్రజాస్వామ్య పరిష్కారాలు కావు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, మీడియా పరస్పర శత్రువులు కావు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే వేర్వేరు వ్యవస్థలు. మీడియా ప్రశ్నించడం తన బాధ్యతగా భావిస్తే, అధికారంలో ఉన్నవారు సమాధానం చెప్పడం తమ బాధ్యతగా గుర్తించాలి. విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమైన ప్రక్రియగా స్వీకరించే సంస్కృతి పెరగాలి. జర్నలిస్టుల భద్రత, మీడియా స్వేచ్ఛ, విభిన్న అభిప్రాయాలకు గౌరవం ఈ మూడు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఒక కలాన్ని భయపెట్టడం ద్వారా నిజాన్ని ఆపలేరు. ఒక గొంతును మూయించడం ద్వారా ప్రజల ప్రశ్నలను నిలువరించలేరు. స్వేచ్ఛగా ప్రశ్నించే మీడియా ఉన్నంతకాలం ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. అదే సమయంలో, బాధ్యతాయుతమైన, నిష్పాక్షికమైన మీడియా మాత్రమే ప్రజాస్వామ్యానికి నిజమైన బలంగా నిలుస్తుంది.

# ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

-అభ్యర్థులకు గూడూరు పోలీసుల విజ్ఞప్తి-

గూడూరు మండల ప్రతినిధి:- జూలై 29. (తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉద్యోగాలకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహిస్తున్న ప్రవేశ (స్క్రీనింగ్) పరీక్ష ఆగస్టు 2, 2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుంది. ఈ ప్రవేశ పరీక్షను మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అలాగే మహర్షి స్కూల్, కేసముద్రం రోడ్ పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకొని పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సూచించారు. రవాణా సౌకర్యం అవసరమైన అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, అవసరాన్ని బట్టి సంబంధిత పోలీస్ స్టేషన్ల నుండి పరీక్షా కేంద్రాలకు వాహనాల ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని జిల్లా పోలీసులు ఆకాంక్షిస్తూ, పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారని, గూడూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. గిరిధర్ రెడ్డి తెలిపారు.


తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్



## ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29:



బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలి. ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. మరో రెండు రోజుల్లో అన్ని డేటా లోపాలను సరిదిద్దాలి.. లేని పక్షంలో బాధ్యులపై చర్యలు తప్పవు. జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం, హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయని తెలిపారు. అందువల్ల బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలని, యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, అన్ని లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం చేసుకొని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని, బీఎల్‌వోలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించాలని సూచించారు. అలాగే అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిని వివరించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏ) అందజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 88 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు రోజుల్లో వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4, 5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈఆర్ఓలు యాదృచ్ఛిక తనిఖీలు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్ డి ఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సలీం , డి టి నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు కి వీడ్కోలు సన్మానం

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 29

ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెమ్ రాజు కి బుధవారం (29.07.2026) పీవీకే-5 ఇంక్లైన్‌లో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు జీఎం షాలెమ్ రాజు ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. వక్తలు మాట్లాడుతూ షాలెమ్ రాజు తన 37 సంవత్సరాల సుదీర్ఘ సేవాకాలంలో బొగ్గు ఉత్పత్తి, భద్రత, క్రమశిక్షణ, ఉద్యోగుల సంక్షేమానికి విశేష ప్రాధాన్యత ఇచ్చి సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. యాజమాన్యం--కార్మికుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతూ, సమస్యల



పరిష్కారంలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. అనంతరం పలువురు ఆయన సేవలను స్మరించుకొని, పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖసంతోషాలతో కూడిన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీవీకే నెం.5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మెహతో మేనేజర్ పి.రవికిరణ్ ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్



ఎండి.రజాక్ ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు , గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాసరావు, సేఫ్టీ ఆఫీసర్ అనిల్ సాగర్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ , ఐఎన్ టియుసి ఫిట్ సెక్రటరీ చిలక రాజయ్య ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ భూక్యా రమేశ్ పిట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-ఎస్సై సిహెచ్ శ్రీకాంత్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జూలై 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, విపత్తు నిర్వహణ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ కోరారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రాణాలను పణంగా పెట్టి వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో లోతు తెలియకుండా



వాహనాలు నడపడం ప్రమాదకరమని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట్లకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సూచనలను పాటించాలని కోరారు ప్రతి కుటుంబం అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పొడి ఆహారం, టార్చ్‌లైట్, మందులు, మొబైల్ పవర్ బ్యాంక్, అవసరమైన పత్రాలను సురక్షితంగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగుల భద్రతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు ప్రమాదాలు లేదా అత్యవసర సంఘటనలు ఎదురైనా ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు పోలీసులు 24 గంటలు సిద్ధంగా ఉంటారని తెలిపారు

## గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. లక్ష్యాల సాధనకు సమష్టి కృషి అవసరం

-ప్రత్యేక అధికారి నిర్మల
-సర్పంచులు, అధికారుల సమీక్ష
-జలసిరి, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, ఆరుతడి పంటలపై కార్యాచరణకు ఆదేశాలు

ఆత్మకూర్, జూలై 29 (తెలంగాణ పత్రిక):

ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి శ్రీమతి నిర్మల అధ్యక్షతన మండలంలోని గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, జల సంరక్షణ కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నుంచి జూన్ నెలల వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సంబంధిత అధికారులు సర్పంచులకు వివరించారు. ప్రతి గ్రామంలో చేపట్టిన పనులు, పూర్తయిన అభివృద్ధి కార్యక్రమాలు, కొనసాగుతున్న పనుల స్థితిగతులను వివరించి, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ



పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం కల్పించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వీబీజీ రామ్ పథకంలో భాగమైన జలసిరి కార్యక్రమాన్ని గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో రెండు ఫామ్ పాండ్లు నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ, వ్యవసాయానికి మేలు కలుగుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని మండల ప్రత్యేక అధికారి నిర్మల సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సీఈఓ బి. శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీఓ యోగిత, ఏపీఓ రాజిరెడ్డి, వైద్యాధికారి స్పందన, వ్యవసాయ అధికారి యాదగిరి, ఎంఈఓ విజయకుమార్, ఏఈపీఆర్ బాబురావుతో పాటు మండలంలోని గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయం లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు,అన్నదానం

-ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు సంజోష్.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29:

ఏటూరునాగారం మండల కేంద్రం లోని శ్రీ షిర్డీసాయి బాబా దేవాలయం లో బుధవారం పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు అనుజ్ పాండే, ఆనంద్ పాండే ,చైర్మన్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబా కి అభిషేకం, అర్చనలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బేవర్స్ సినిమా హీరో సంజోష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు.ఆలయ అర్చకులు హీరోకి వేద ఆశీర్వాదం అందించారు.అలాగే ఈ పర్వదినం సందర్భంగా ఆలయంలో కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న 75 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే దేవాలయం ఫంక్షన్ హాల్ లో బ్యూటీషియన్, జూట్ బ్యాగ్ శిక్షణ పొందిన 110 మంది మహిళలకు సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ సందర్భంగా హీరో సంజోష్ మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సందర్భ ంగా ప్రజల ,ప్రేక్షకుల దీవెనలు, సాయి నాధుని ఆశీస్సులు ఎల్లా వేళలా ఉండాలని కోరారు.హీరో కూడా దేవాలయానికి ప్రతి కార్యక్రమంలో కూడా సహకారాన్ని అందించడం పట్ల చైర్మన్, కమిటీ, ఆలయ అర్చకుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్న ప్రసాద స్వీకరణ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు 1500 మందికి పైగా వానను సైతం లెక్క చేయకుండా విచ్చేసి స్వీకరించారు. విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టరేట్ పొందిన చల్ల గురుగుల చలపతి చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బచ్చు సతీష్, ప్రధాన కార్యదర్శి పర్వతాల కుమార స్వామి,సహాయ కార్యదర్శి గంజి రమేష్, కోశాధికారి వెంకట్రావు,మాధవ్, నర్సింహా చారి,యాదగిరి, నూతి రమేష్,కమిటీ సభ్యులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143